క్లుప్తంగా

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



జనగామ: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డిని జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బాల్దె సిద్దిలింగంతో కలిసి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. జనగామ మార్కెట్ పరిధిలో ఒక కవర్‌షెడ్, రెండు గోదాం నిర్మాణంతో పాటు ఏఎంసీలో ప్రతి రోజు రైతులకు రూ.5 భోజనం, తదితర అభివృద్ధి పనులకు సంబంధించి రూ.3 కోట్ల ప్రతిపాదనలతో మంత్రికి వినతి పత్రం అందజేశారు. అలాగే జిల్లా పరిధిలో ఉండి, సిద్దిపేట జిల్లాకు అనుసంధానంగా పని చేస్తున్న బచ్చన్నపేట, నర్మెట, తరిగొప్పుల మార్కెట్‌లను జనగామలో విలీనం చేయాలని కోరారు. కాగా, మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సిద్దిలింగం తెలిపారు.

ఎన్నిక

పాలకుర్తి టౌన్: మేకలు, గొర్రెల మాంసం విక్రయ యజమానుల సంఘం పాలకుర్తి పట్టణ అధ్యక్షుడిగా పెండ్యాల రాములు, ప్రధాన కార్యదర్శిగా చిలువేరు గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ అవరణంలో ఆ సంఘం సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఆంబోతు రవి, కోశాధికారిగా ఎండీ రఫీ, కార్యవర్గ సభ్యులుగా ఎండీ నజీర్, ఎండీ ఖాజా, చిలువేరు సోమనర్సయ్య, కత్తుల కుమార్, జీడి సమ్మయ్య, భాస్కర్‌లు ఎన్నికయ్యారు.

భూమి పూజ

చిల్పూరు: మండలంలోని లింగంపల్లిలో జూన్ 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన ఉత్సవాల పనుల్లో భాగంగా ధ్వజస్తంభం, నవగ్రహాల ఏర్పాటు కోసం సర్పంచ్ ఏదునూరి రవి బుధవారం ముగ్గుపోసి భూమి పూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్ గంగుల సంపత్ రెడ్డి మాట్లాడారు. ఎంపీటీసీ రవి, ఉపసర్పంచ్ రాజన్న, రవీంద్రచారి, ఎల్లయ్య ఉన్నారు.

నివాళి

దేవరుప్పుల: ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, జనగామ మార్కెట్ మాజీ చైర్మన్, దేవరుప్పుల మాజీ జెడ్పీటీసీ, చిన్నమడూరు మాజీ సర్పంచ్ పరవస్తు నర్సింహస్వామికి పలువురు ఘననివాళులర్పించారు. బుధవారం చిన్నమడూరుతోపాటు పలు గ్రామాల నుంచి హైదరాబాద్ నాగోల్‌లో జరిగిన అంత్యక్రియలకు కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున తరలివెళ్లారు.

పరామర్శ..



జనగామ: జనగామ మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింహస్వామి మృతి చెందగా, కాంగ్రెస పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ వేమెళ్ల సత్యనారాయణరెడ్డి బుధవారం నివాళులర్పించి, కుటుంబాన్ని పరామర్శించారు. మార్కెట్ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో నర్సింహస్వామి మంచి పేరు తెచ్చుకున్నాడని అన్నారు.

27 నుంచి సీపీఐ రాజకీయ శిక్షణ తరగతులు

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో ఈ నెల 27, 28 తేదీల్లో సీపీఐ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి జువారి రమేష్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిసున్నాయని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదన్నారు. వెంకట్‌రెడ్డి, చంద్రమౌళి, సమ్మయ్య, ఎండి జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి సత్కారం

రఘునాథపల్లి: రఘునాథపల్లి ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రఘుపతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం రఘునాథపల్లి పోలీస్‌స్టేషన్‌లో మర్యాద పూర్వకంగా వారు ఎస్సైని కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు.

కుట్టుశిక్షణ కేంద్రం సందర్శన

పాలకుర్తి టౌన్: కుట్టు శిక్షణ కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ నల్లా నాగిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జర్నలిస్టు కాలనీలోని రైతు వేదికలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాలన్ని ఎంపీపీ నాగిరెడ్డి సందర్శించి మాట్లాడారు. డీఎల్‌పీఓ వెంకట ప్రసాద్, ఎంపీడీఓ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

20 నుంచి బొడ్రాయి, దుర్గమ్మ ఉత్సవాలు

కొడకండ్ల: ఈ నెల 20, 21 తేదీల్లో లక్ష్మక్కపల్లిలో బొడ్రాయి, దుర్గమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ పుస్కూరి శోభారాణి తెలిపారు. గ్రామ పెద్దలతో చర్చించి ఉత్సవాలపై నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. 20న జరిగే బొడ్రాయి జలాభిషేకం కార్యక్రమానికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొంటారని, అదేరోజు పలు శంకుస్థాపనలు చేస్తారని పేర్కొన్నారు.

క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి



తరిగొప్పుల: కబడ్డీ పోటీల్లో గెలుపొందిన జట్టుతో సీఐ, ఎస్సైలు



లింగాలఘణపురం: సర్టిఫికెట్లు అందుకున్న క్రీడాకారులతో ఎంపీపీ, జెడ్పీటీసీ

తరిగొప్పుల: పోటీల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని సీఐ నాగబాబు అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో సీఐ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కబడ్డీ పోటీల్లో మండలంలోని నర్సాపూర్ కబడ్డీ జట్టు, వాలీబాల్‌లో బోజ్యాతండా జట్టు గెలుపొందగా వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దూదిమెట్ల నరేష్, వ్యాయమ ఉపాధ్యాయులు శ్రీనివాస్, మాధవి, పంచాయతీ కార్యదర్శులు, క్రీడాకారులుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సర్టిఫికెట్ల అందజేత

లింగాలఘణపురం: మండల కేంద్రంలో గత మూడు రోజులుగా జరిగిన సీఎం కప్–2023 మండల స్థాయి విజేతలకు బుధవారం ఎంపీపీ, సీఎం కప్ స్పోర్ట్స్ చైర్మన్ చిట్ల జయశ్రీ సర్టిఫికెట్లను అందజేశారు. జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి, ఎంపీడీఓ మల్లికార్జున్, ఎస్సై ప్రవీణ్, నోడల్ ఆఫీసర్ విష్ణు, పీడీ కిష్టయ్య, నాయకులు నాగేందర్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సీఎం కప్ మండల స్థాయి పోటీలు

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సీఎం కప్ మండల స్థాయి క్రీడలు ముగిసినట్లు ఎంపీపీ బావండ్ల నాగజ్యోతికృష్ణంరాజు, ఎంపీడీఓ రఘురామకృష్ణ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ కబడ్డీలో బచ్చన్నపేట, వాణీ పాఠశాల, ఆదర్శ పాఠశాల, పోచన్నపేట, వీఎస్ఆర్ నగర్, నాగిరెడ్డిపల్లి గ్రామాల జట్లు పాల్గొనగా బచ్చన్నపేట విజేతగా నిలిచిందన్నారు. అలాగే వాలీబాల్ పోటీలో బండనాగారం, నాగిరెడ్డిపల్లి, పోచన్నపేట, నారాయణపురం జట్లు పాల్గొనగా నాగిరెడ్డిపల్లి విజేతగా నిలిచిందన్నారు. కబడ్డీలో, వాలీబాల్‌లో 10 మంది చొప్పున, ఖోఖోలో 12 మందిని, 400, 100 మీటర్ల పరుగు పందెంలలో ఇద్దరి చొప్పున ఎంపికి చేసి వారిని జిల్లా స్థాయి క్రీడలకు పంపిస్తున్నామని తెలిపారు. పీఈటీ వీర్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

‘ఇంగ్లిష్’పై పట్టు సాధించడం అవసరం



మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత పరిస్థితుల్లో ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించడం ఎంతో అవసరమని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్‌కుమార్ అన్నారు. మండలంలోని శివునిపల్లి జెడ్పీఎస్ఎస్‌లో టీఎస్ యూటీఎఫ్ జనగామ జిల్లా శాఖ, పూలే అధ్యయన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులను బుధవారం ప్రారంభించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంగ్లిష్ భాషపై పట్టు ఎంతో అవసరమని, విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు అందిపుచ్చుకునేందుకు దోహదం చేస్తుందన్నారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రావు, తాడూరి సుధాకర్, తోట వెంకటేశ్వర్లు, గుండె కనుకయ్య, ఆవుల అమర్‌నాథ్, చిక్కుడు శ్రీనివాస్, కృష్ణమూర్తి, నీలకంఠం, ఫకీర్‌దాస్, యాతం రమేష్, కృష్ణమోహన్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న అధికారులు

బచ్చన్నపేట: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు వీధుల్లో, రోడ్ల వెంబడి పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయని వాటిని వెంటనే తొలగించాలని అన్నారు. సర్పంచ్‌లు వడ్డెపల్లి మట్టారెడ్డి, బందారం సుశీల, వేముల వెంకట్‌గౌడ్, పంజాల తార, ఏపీఎం మురహరి, కార్యదర్శులు అనిల్‌రాజ్, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత

దేవరుప్పుల: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి నైతిక బాధ్యతగా తీసుకోవాలని ఎంపీపీ బస్వ సావిత్రి సూచించారు. బుధవారం ఈ నెల 17 నుంచి 23 వరకూ గ్రామాల్లో నిర్వహించే ప్రత్యేక పరిశుభ్రత (స్పెషల్ శానిటేషన్)కార్యక్రమంలో భాగంగా సీతారాంపురంలో పరిసరాలను ఆమె పరిశీలించి జీపీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్పంచ్ రమేష్, వీరాచారీ,టీఏ యాదగిరి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న కిరణ్ కుమార్ గౌడ్

జనగామ: జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్ గ్రామానికి చెందిన తుపాకుల రాజు కుటుంబానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ బుధవారం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమారుడు అభిరామ్ అక్కడికక్కడే మృతి చెందగా, తండ్రి రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక నాయకుల సమాచారం మేరకు కిరణ్ కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. భవిష్యత్‌లో కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట సర్పంచ్ వంగాల రేణుక శంకర్, పార్టీ మండల అధ్యక్షులు బైరగోని యాదగిరి, ఎంపీటీసీ బానోతు స్వరూప, ఉప సర్పంచ్ కుమార్, గ్రామ శాఖ అధ్యక్షులు కరుణాకర్, నాయకులు పెంటయ్య చారి, రాజ్ కుమార్, కరుణాకర్, చంద్రశేఖర్, పగిడిపల్లి చంద్రమౌళి, మల్లేశం, ఉదయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

హరినాథ బాబా కల్యాణం



జనగామ రూరల్: కుసుమ కుమారి హరినాథ బాబా కల్యాణం మహోత్సవాన్ని బుధవారం సూర్యాపేట రోడ్డులోని కుసుమ కుమారి హరినాథ ధ్యాన మందిరంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరినాథ్ బాబా కమిటీ అధ్యక్షుడు నర్ర శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, కోశాధికారి పంతులు ప్రభాకర్, ఉపాధ్యక్షుడు గొర్రెల రవికుమార్, కార్యవర్గ సభ్యులు పుట్ట రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న వెంకటేష్

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు నిర్మించి ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ వినయలతకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని గోపాల్‌నగర్‌లో ప్రభుత్వ భూమి ఉందని అట్టి స్థలంలో ఇళ్లు లేనివారికి నిర్మించి ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం హామీలను నెరవేర్చుకోవాలన్నారు. గోపాల్‌నగర్ ప్రజలు వందలాదిగా రావడంతో ఎలాంటి గొడవ జరుగకుండా ఎస్సై నవీన్‌కుమార్ తహసీల్ కార్యాలయానికి వచ్చి చూసుకున్నారు. రామగళ్ల అశోక్, కల్లెం రమేష్, కడకంచి బాలరాజు, గంగరబోయిన బుచ్చవ్వ, శైలజ, యాదగిరి, నరేష్, రాజవ్వ, మణెమ్మ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

స్వర్గరథం బహూకరణ



స్వర్గరథం పత్రాలను సర్పంచ్‌కు అందజేస్తున్న కల్యాణిరాజేందర్

రఘునాథపల్లి: రఘునాథపల్లి గ్రామ పంచాయతీకి అదే గ్రామానికి చెందిన దుద్దెల్ల కల్యాణిరాజేందర్ తన మామ శామిశెట్టి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం స్వర్గరథం బహూకరించారు. బుధవారం జీపీ వద్ద అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో సర్పంచ్ పోకల శివకుమార్‌కు స్వర్గరథం పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వాహన దాత రాజేందర్ మాట్లాడుతూ చివరి మజిలీ సాఫీగా సాగేలా గ్రామస్తులకు స్వర్గరథం ఉపయోగపడుతుందని అందజేసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీకి స్వర్గరథం అందజేసిన కల్యాణిరాజేందర్‌ను అధికారులు, గ్రామ పెద్దలు అభినందించారు. జెడ్పీటీసీ బొల్లం మణికంఠ, ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు కూరెళ్ల ఉపేందర్, ఎంపీడీఓ ఎండీ హషీం, ఎంపీఈఓ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ రమేష్‌గౌడ్, గ్రామ పెద్దలు శ్రీనివాస్, రవీందర్, శంకర్‌లింగం, సోమేశ్వర్, బెలిదె శ్రీను, లెనిన్, నర్సింహులు, ఉపేందర్, రాములు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



జనగామ: వాసవీ క్లబ్ గెలాక్సీ జనగామ ఆధ్వర్యంలో పట్టణంలోని రైల్వేస్టేషన్ ఏరియాలో క్లబ్ వీ105ఏ డిస్ట్రిక్ట్ గవర్నర్ మానేపల్లి రామారావు ఆదేశాల మేరకు బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ గందె వేణు, అధ్యక్షుడు అయిత శ్రీకాంత్, కార్యదర్శి తోడుపునూరి ప్రసాద్, కోశాధికారి బుస్సా పాండు, ప్రతినిధులు కాసాల సంతోష్ కుమార్, సోమరాజు, గంగిశెట్టి మంజునాద్, శివరామ కృష్ణ, గుండా శ్రీకాంత్, మొగుళ్లపల్లి శ్రీనివాస్, కందుకూరి రాజేశ్వర్, గట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన క్లబ్ సభ్యులను రామారావుతో పాటు రీజియన్ చైర్మెన్ మహంకాళి ఉమామహేశ్వర్ అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

లింగాలఘణపురం: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఏఓలు చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. వీఏఓల సంఘం మండల అధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి తహరాబేగం, కోశాధికారి పద్మ, వీఏఏలు స్వాతి ఉన్నారు.

ధాన్యం తూకంలో తేడా రావొద్దు



రైతులతో మాట్లాడుతున్న సీఐ సంతోష్

రఘునాథపల్లి: ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను మోసం చేసేలా తూకంలో తేడా రావొద్దని జనగామ రూరల్ సీఐ ఆర్ సంతోష్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. నిర్వాహకులు ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో ఎవరైనా మోసానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై రఘుపతి, ఎంపీటీసీ పేర్ని ఉషారవి, రైతులు పాల్గొన్నారు.

కార్యదర్శిపై చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న విష్ణు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లి గ్రామ పంచాయతీ ఈఓగా గతంలో పనిచేసిన వెంకట కిషోర్ రూ.7,28,560 అవినీతికి పాల్పడ్డారని, ఈ విషయమై సంబంధిత ఉన్నతాధికారులు చట్టపరంగా తగిన చర్య తీసుకోవాలని శివునిపల్లి ఏకైక వార్డు సభ్యుడు (8వ వార్డు) బూర్ల విష్ణు డిమాండ్ చేశారు. శివునిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యదర్శి అవినీతి విషయమై జనగామ, హనుమకొండ జిల్లా కలెక్టర్లకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామని, ఇంతవరకూ ఎలాంటి చర్య తీసుకోలేదన్నారు. జనగామ జిల్లా కలెక్టర్, డీపీఓ ఈ విషయమై స్పందించకపోవడంలో ఆంతర్యమేమిటని, విజిలెన్స్ ద్వారా విచారణ చేయించి జీపీకి రావాల్సిన నిధులను దుర్వినియోగం చేసిన వ్యక్తిపై కఠిన చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, ఈ విషయమై శివునిపల్లి మాజీ ఈఓ, ప్రస్తుత ఐనవోలు కార్యదర్శి వెంకటకిషోర్‌ను వివరణ కోరగా ఆరోపణలు అవాస్తవమని, తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు.

క్రైం కార్నర్

ఆలయంలో చోరీ



సీసీ ఫుటేజీలో గర్భాలయంలో అమ్మవారి మెడలో నుంచి ఆభరణాలు తీస్తున్న ముసుగు దొంగ

జనగామ: బతుకమ్మకుంట దుర్గామాత ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దొంగతనం జరిగి నెలగడవక ముందే.. మరోసారి ముసుగు దొంగలు అమ్మవారి నగలు, నగదు ఎత్తుకెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ పట్టణం బతుకమ్మకుంట దుర్గామాత ఆలయంలో రాత్రి పూజలు ముగిసిన తర్వాత తాళం వేసుకుని వెళ్లపోయారు. సీసీపుటేజీల పరిశీలన ద్వారా రాత్రి 12.38 నిమిషాలకు ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ముసుగులు ధరించి ఆలయంలో చొరబడ్డారు. వెంట తెచ్చుకున్న పరికరాలతో ఆలయ ప్రధాన ద్వారం తాళాలను బద్దతు కొట్టి లోనికి ప్రవేశించారు. అమ్మవారి మెడలో ఉన్న సుమారు 4 తులాల బంగారు ఆభరణాలు, హుండీని పగులగొట్టి, అందులో భక్తులు వేసిన రూ.2 నుంచి 3 లక్షల వరకు నగదును ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకుని సీఐ ఎలబోయిన శ్రీనివాస్, ఆయన టీం బుధవారం ఆలయానికి వచ్చి విచారణ చేశా రు. సీసీ ఫుటేజీల పరిశీలన కోసం హార్డ్ డిస్క్ తమ వెంట తీసుకెళ్లారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చీటింగ్ కేసు నమోదు

తరిగొప్పుల: విక్రయించి భూమిని యజమానికి తెలియకుండా తన కూతురి పేరిట పట్టా చేసినందుకు, నంబర్ ప్లేట్ లేకుండా ద్విచక్ర వాహనం నడుపుతూ పట్టుబడిన ఇరువురి వ్యక్తులపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.మండలకేంద్రానికి చెందిన యాటెల్లి సుదర్శన్ సర్వేనంబర్ 213లో 25 గుంటలు భూమిని 2008 సంవత్సరంలో మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన ఎంగల మల్లేషంకు రూ.5,6250 విక్రయించాడని తెలిపారు. కాగా, అట్టి భూమిని యాటెల్లి సుదర్శనం తన కూతురు పేరిట పట్టా చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా మండలంలోని జాలుబాయి తండాకు చెందిన సభావత్ హర్యా ద్విచక్ర వాహనానికి నంబర్ ప్లేట్ లేకుండా నడుతపుతూ వాహన తనిఖీలో పట్టుబడినట్లు పేర్కొన్నారు. సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పరస్పర దాడులపై కేసు నమోదు





గాయపడిన మల్లయ్య, వెంకటయ్య

దేవరుప్పుల : అన్నదమ్ముల మధ్య స్థల వివాదం నేపథ్యంలో పరస్పర దాడులు చేసుకున్న ఘటనలో ఇరువురితోపాటు మరో ఇద్దరు గాయపడ్డారు. బుధవారం కడవెండిలో జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి కడవెండి గ్రామంలో తోటకూరి మల్లయ్య వాకిల్‌దార్ పండుగ చేసుకునేందుకు తన స్థలాన్ని చదను చేస్తుండగా.. పాత్తుల జాగలో హద్దులు పెట్టాకే వాడుకోవాలని అతడి అన్న తోటకూరి అంజయ్య వాగ్వాదానికి దిగడంతో ఇరువురు దాడులకు పాల్పడ్డారు. అంజయ్యకు స్వల్పంగా, మల్లయ్య తలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనతో మల్లయ్య తరపు వ్యక్తులు అంజయ్య కోసం వెతికే క్రమంలో సుడిగెల వెంకటయ్య, తిరుతయ్యపై దాడి చేశారు. ఈ ఘటనపై ఎస్సై మునావత్ రమేష్‌నాయక్‌ను వివరణ కోరగా స్థల వివాదంపై గొడవలో అన్నదమ్ములు దాడులు చేసుకున్న విషయమై తోటకూరి అంజయ్య కొడుకు మల్లేష్, మల్లయ్య కొడుకు మహేష్, సుడిగెల వెంకటయ్య కొడుకు రంజిత్ వేర్వేరుగా ఫిర్యాదు ఇచ్చారని, ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో గడ్డి కట్టలు దగ్ధం



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం శివారులోని వ్యవసాయ భూముల వద్ద షాట్ సర్క్యూట్‌తో గడ్డి కట్టలకు నిప్పంటుకుని దహనం కాగా దాదాపు ఇరవై మంది రైతులకు చెందిన రూ.3లక్షల వరకు నష్టమైన సంఘటన బుధవారం జరిగింది. బాధిత రైతులు గంగారపు కేదారి, లింగనబోయిన లింగయ్య, ఎల్లయ్య, కత్తుల బుచ్చయ్య, పిట్టల అనీల్ తదితరులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వ్యవసాయ భూముల వద్ద గడ్డి కట్టలు ఉంచడం జరిగింది. కాగా, మధ్యాహ్నం ఈదురుగాలులతో పాటు షాట్ సర్క్యూట్‌తో గడ్డి కట్టలకు నిప్పంటుకోగా దాదాపు 50 ఎకరాల విస్తీర్ణంలో గడ్డి పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో దాదాపు రూ.3లక్షలు నష్టం వాటిల్లిందని, సంబంధిత అధికారులు, ప్రభుత్వం స్పందించి ఆర్థికంగా ఆదుకోవాలని వారు కోరారు.

వృద్ధురాలు మృతి

పాలకుర్తి టౌన్: ఆటో నుంచి కింద పడి గాయాలపాలైన దర్దేపల్లికి చెందిన వృద్ధురాలు భారతమ్మ(62) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు యాట పరుశరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టీ శ్రీకాంత్ తెలిపారు.

సంక్షేమ పథకాలను వివరించాలి



మాట్లాడుతున్న బేజాడి బీరప్ప

బచ్చన్నపేట: మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు కార్యకర్తలు వివరించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు విసిగి వేసారి ఉన్నారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేక పోయిందని అన్నారు. రాబోవు ఎన్నికల్లో ప్రజలు నూతనత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. నేడు(గురువారం) బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో హైదరాబాద్ నాగోల్‌లోని శుభం ఫంక్షన్ హాల్‌లో జరిగే ఆత్మీయ సమ్మేళనానికి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అఫ్జల్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ నవీన్, మండల కార్యదర్శి గద్ద రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



రఘునాథపల్లి: మాట్లాడుతున్న కుమార్‌గౌడ్




లింగాలఘణపురం: మాట్లాడుతున్న జయశ్రీ

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించనున్న బీఆర్ఎస్ ఖిలాషాపూర్ క్లస్టర్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎంపీపీ వై.కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం నిడిగొండలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే రాజయ్య నేతృత్వంలో జరిగే ఆత్మీయ సమ్మేళనానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని ఆయన పిలుపు నిచ్చారు. జెడ్పీటీసీ బొల్లం మణికంఠ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్, మాజీ వైస్ చైర్మన్ నామాల బుచ్చయ్య, మడ్లపల్లి సునితరాజు, తిప్పారపు రమ్య బాబురావు, మాల రాజు, దుబ్బాక హరీష్‌గౌడ్, తాటికొండ వెంకటేష్‌యాదవ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

లింగాలఘణపురం: ఈ నెల 19న మండలంలోని నెల్లుట్ల భ్రమరాంబ ఫంక్షన్ హాల్‌లో జరిగే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ చిట్ల జయశ్రీ, జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని 21 గ్రామాల్లో పర్యటించి బీఆర్ఎస్ కార్యకర్తలను ఆత్మీయంగా కలుసుకొని మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసు, ప్రధాన కార్యదర్శి మల్లేశం, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గణపతి, నాయకులు నాగేందర్, బోయిని రాజు, కుమారస్వామి, భాగ్యలక్ష్మి, శ్రీహరి, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

బీరప్ప పండుగకు విరాళం



విరాళం అందజేస్తున్న సర్పంచ్ రవీందర్‌రెడ్డి

బచ్చన్నపేట: మండలంలోని నారాయణపురంలో కురుమల ఆరాధ్య దైవమైన బీరప్ప–కామరాతి పండుగకు సర్పంచ్ మాసపేట రవీందర్‌రెడ్డి రూ.1.56 లక్షలను విరాళంగా అందజేశారు. బుధవారం గ్రామంలోని ఆలయ ఆవరణలో విరాళాన్ని అందించిన అనంతరం మాట్లాడుతూ కులస్తులు అందరూ కలిసి సామూహికంగా నిర్వహించే పండుగలు ఐకమత్యానికి దోహదపడతాయన్నారు. విరాళం అందించిన సర్పంచ్ రవీందర్‌రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.